సోమసుత

ఓ సోమసుతా! నువ్వు నా ప్రియురాలవు. కాని నీ కోసం దేశాలన్నీ వెదుకుతూ వున్నాను. నువ్వు ఎప్పుడూ దూరదూరాననే. నీ మూర్తి నా కౌగిలికి యెప్పుడూ అందలేదు. విదియనాటి చంద్రవంక విరిసే కొత్త లేవెన్నెలలోని మసక మసక కిరణాల మధ్య చిన్న బాలిక నడివేసవిలో పూలకై వెదుకులాడినట్లు నీకోసం వెదకీ వెదకీ యేటి ఒడ్డున నిట్టూర్పు విడుస్తూ చదిగిలంబడ్డాను. తియ్యటి చంద్రవంక యెట్టటి నవ్వులు నవ్వుతూ పడమటికొండల వెనుక పక్కన మాయమైంది. దిశలు చీకటి మేలిముసుగులు సవరించుకొన్నాయి. ఏటి కెరటాల అంచులమీద చంద్రవంకలు నృత్యంచేస్తూన్నట్లే కనపడ్డాయి. ఓ సోమసుతా! నువ్వు చంద్రుని తనయవు. నువ్వు ప్రేమ బాలవు. నిన్నెప్పుడూ నా కళ్ళలోనే దర్శించాను. వెన్నెట్లో పడుకొని నిన్ను గురించి కలల మధ్యన నేను పులకరాలు పొందుతూ వుంటే ఒక్కనాడూ నువ్వు నాకు ప్రత్యక్షం కాలేదు. ఆ వెన్నెట్లో నేను గాఢసుషుప్తిలో మైమఱచి ఉన్నప్పుడు ఉజ్వలానంద జ్యోత్స్నలైన నీ చూపులు అరమూతల చక్రవాకాలుకాగా నా సమీపంలో మూర్తి పొంది నన్ను నీ లేత చిగుళ్ళ చల్లని వేళ్ళతో తాకి, నేను ప్రేమతో జలదరించి మత్తులూరి తీపి తేనియల తేలి కళ్ళు తెరచే లోపలే నువ్వు అదృశ్యమైనావు.

నువ్వు నా ప్రణయ వల్లరివి. నా భావాలు, నా కోర్కెలు చివుళ్ళలో నుంచి చిరుపసిరి కంది మొగ్గలు తొడిగే చిన్ననాటి నా ఆటరోజుల్లో నేను రాజకుమారుణ్ణి, నువ్వు రాజకుమార్తెవు. ఒక్కణ్ణీ నీ లేత వెన్నముద్ద బుగ్గలు, నీ తెల్లవారిగట్ల చుక్కల్లాంటి కళ్ళు, నీ నునుకసిరి చిగుళ్ళ పెదవుల్ని ముద్దెట్టుకున్నా. మా అమ్మ "పిచ్చినాన్నా, ఏమిట్రా, కల్లో ఎవళ్ళనిరా ముద్దెట్టుకుంటున్నావు" అన్నది. నేను సిగ్గుతో చిరునవ్వు నవ్వుతూ, కళ్ళు సగం తెరిచి అప్పుడే పట్టే తేనె పొరలోని మొదటి చుక్కల్లాంటి చూపులు ప్రసారించి ఊరుకున్నాను. మా అమ్మ నూతి దగ్గరకు వెళ్ళిపోయింది.

"తమ్ముడూ, కాశీమజిలీలు చదువుతున్నావా?"

"కథ పూర్తిఅయింది."

"అందుకనేనా పుస్తకం రొమ్ముమీద పడవేసుకుని దిండాని పడుకున్నావు?"

"రాజకుమార్తె!"

"పెళ్ళాడావా?"

"ఏడంతస్థుల మేడ!"

"హంసతూలికా తల్పం మీద - ఒక్క రాజకుమార్తే?"

"ఇద్దరు.!"

"ఎవరెవర్రా?"

"సూర్యుడి కూతురూ, చంద్రుడి కూతురూ.!"

"ఓరి కన్నా! ఇద్దరుట్రా, వేగిపోతావురా! ఇద్దరి పోరూ పడలేవురా బాలిగా!"

"కాదు ఇద్దరూ ఒకటేనే!"

"అదేమిటిరా నాన్నా! బాబయ్య చెప్పిన కథలు కంగాళితం చేస్తున్నావు.!"

"చంద్రుడు ఓమాటు చక్కని ఆడపిల్ల అయ్యాడు. అప్పుడు సూర్యుడు మోహిస్తే వాళ్ళిద్దరికీ ఓ అమ్మాయి పుట్టింది."

"పురూరవుడి కథలా వుంది. బాబయ్య చెప్పాడుగా"

"అవును, అల్లాంటి కథలు చాలా ఉన్నాయిలే."

2

చిన్నతనంలో ఎంతమంది అందమయిన చుట్టాల అమ్మాయిల్ని నువ్వేమోనని చూశాను కాదు! యవ్వనంలో దేశాలు తిరిగాను. అందర్నీ రైల్లెక్కే బాలికల్ని, రైళ్ళలోని వాళ్ళను, తీర్థాలకు వచ్చిన పడతుల్ని, కాలేజీలకు, హైస్కూళ్ళకూ వెళ్ళే, వచ్చే చంచల నేత్రల్ని, సభలకు మహా సభలకు ఏతెంచే కోకిలస్వనలను తేరిపార చూశాను. నవ్వులందినాను. తెల్లపోవుట పారచూశా! తిట్టులు కూడా వినిపించినవి. కొందరు బాలలు "ఎవరికోసం?" అని విద్యాశాలలు దగ్గిర ప్రశ్నించే చూపులకు జవాబివ్వక పారిపోయినాను.

ఒక రోజున ఒక పెద్ద పట్టణంలో సినిమా ప్రదర్శనం అయిన వెనుక ట్రాము ఎక్కి వెళ్ళబోయే నాకు ఒక బాలికా కుసుమగుచ్ఛం ప్రత్యక్షం అయ్యింది. అందులో ఓ అమ్మాయి చాలా అందంగా ఉన్నట్టు కనబడింది. ఆమె నావేపు ఓసారి చూచింది. కళ్ళు మెరిశాయి నా కలల్లోని చంద్రబాల. ఆమె చిరునవ్వు నవ్వింది. నేను తెల్లబోయినాను. అదిగో సూర్య చంద్రసుత! శిల్పాది దేవత! సర్వరసవహ్ని!

"వెదికినానే నిన్ను
చదల భూమిని గాలి,
చదివినానే నిన్ను
కథల, పాటల, కలల
సుదతి నా యాత్ర కే -
- విధము ఫలమొచ్చేను?
బాలికా బాలికా
బంగారు తూలికా
మల్లె జూకామల్లె
మాలికా మాలికా"

ఈ పాట నా గొంతుకలోంచి అప్రయత్నంగా వచ్చింది.

ఆ అమ్మాయి వెనక్కు తిరిగి "మీదేవూరు" అని ప్రశ్నించింది. దగ్గరొక పల్లె అని జవాబు చెప్పాను. "ఈ పట్టణంలో చదువుకుంటున్నారా?"

"చదువు పూర్తిచేసుకొని సరదాకోసం దేశాలు తిరుగుతున్నాను."

"మిమ్మ ల్నెక్కడో చూచినట్లుంది?"

"ఇక్కడే చూచి ఉంటారు"

"ఎక్కడ మీరు చదువు పూర్తిచేసుకొంటా?"

"శాన్తినికేతనంలో."

"ఏమి అదృష్టమండి! శాన్తినికేతనం చాలా అందమైనదట! ఎంతో చక్కగా చదువూ – నాగరికతా – జీవితమూ – ఉంటుందట కాదూ?"

"ఔనండీ. ఈ నాటి కవి ప్రపంచంలో దివ్యుడైన మహాకవి పరిపాలిస్తూవున్న ఆ రాజ్యంలో సంచరించటాని కదృష్టం పొందిన వాళ్ళంతా అమరులు అని మనవి చేస్తున్నాను."

"అయితే మీకు కూడ అమరత్వం బాగా అబ్బిందన్నమాట!"

"ఎవరో నా వంటి మూర్ఖులకు తప్ప."

"అయితే మీరు తప్పకుండా మా యింటికి రావాలి. మానాన్న గారికి రవీంద్రుడంటే మహావెఱ్ఱి. రేపు తీరుబడిగావుంటే వస్తారా?"

"అతి సంతోషంగా".

ఆ రాత్రి ఎలా వేగిరించానో తెలియదు. అసలు నిద్రలేదు. సముద్రములోని మహాతరంగాలులా కలలు తరుముకు వచ్చినవి.

"ఏటి మిలమిలలోన
తోట నవనవలోన
వెలుగు నీడలవైపు
వెదుకుతూ ఉన్నాను."

ఈమే సోమసుత కాబోలు. కాబోలేమి? ఈమే నా సోమసుత. ఎంత అందమైనది. ఆమె మాటలు పాటలే. ఏదో మహదర్థములేక యిల్లా తనకు తానై ఎలా పలకరిస్తుంది. ఇంటికిరమ్మన్నది. ఆ ఇల్లు నాకలోకంలోని ఒక భవనమా? దాని గోడలు పూలతో కట్టి ఉంటారు. పై కప్పు చిగుళ్ళు వెన్నెల కిరణాలు దూలాలు. భరతపక్షి పాటలు తలుపులు. ఆమెకు చెలికత్తెలు నక్షత్రాలు, నే నలంకరించుకోనా? గుప్తమైయున్న నిధులన్నీ అలంకరణ యోగ్యమైన నగలకోసం మంత్రపు కాటుక పెట్టుకొని పారకించి చూడాలనా? నేను సంతోషంతో లోకమావరిస్తోన్నాను. వెన్నెలలో తేలిపోతూన్నాను. ఈ వెన్నెల ఎంత పరిమళమైయున్నది. ఈ వెన్నెల కొంత తీసుకొని మొఖానికి వొంటికి రాసుకోనా? ఈ పువ్వులు వర్షం కురుస్తోన్నవేమిటి? ఈ పువ్వులలో దాగివున్న కోమలత్వమంతా యమునానదిలా ప్రవహిస్తూన్నది. ఈదలేక మునిగిపోనుకదా?

3

అరుణకాంతుల గులాబీరేకల్లా చల్లుతూ ఉదయ సంధ్యాదేవి ప్రత్యక్షమై నన్ను చూసి చిరునవ్వు నవ్వుతూ మాయమైపోయింది. ఆ రేకలపై ఒదిగియున్న పన్నీటి మంచు బిందువులు చెదిరి నా వొంటినిండా పడ్డవి.

అలంకరించుకొన్నాను అమృతభూషణాలు -- ఆనంద వసనాలూ--

ఎనిమిది గంటలకు వారి ఇంటికి చేరుకొన్నాను. సేవకుడు చూపించిన కుర్చీపై త్రిభంగాకృతిని అధివసించాను. “కలయో? నిక్కువమో?” అనుకొన్నాను.

“ఏదండి కల అని అనుమానం తెచ్చేది?” అని నిన్నటి ఆ బాలిక గాలికి కదిలిన తామరపూదళములులా పెదవులు కదిలించి నవ్వింది.

ఓ సూర్యసుతా, నీవప్పుడామె కళ్ళల్లోంచి తొంగి చూచావు. నీ నిర్మలజ్యోత్స్నలు ఆ మందిరమంతా ఆవరించినవి.

అప్పుడు నే నన్నాను “కలగాని కల, నిక్కువముగాని నిక్కువము, వెలుగు నీడలలా చక్రాకృతిని మహావేగంతో తిరుగుతూంటైగదా!”

దుష్ప్రాహం చూచినవారి మాట” ఇదే సమయం సంభాషణ వేరేవిధంగా మార్చటానికి.

“ఆ సూరదాసుకథ యెంత మనోహరంగా వున్నది. ఆ కథను ఏ న్యూ థియేటర్సు వాళ్ళో ఫిలింతీస్తే బాగానే వుంటుంది.”

సోమసుత అయిన ఒక బాలిక భౌమ్యవాసనల నానందించు భావపూర్ణ హృదయగా ప్రత్యక్షంగా ఏలా అవుతుంది? స్వర్గములోని దేవతా కన్యలు శాసనసభలను గురించి చర్చించుకుంటారా?

ఈ ఆలోచన మనస్సులో మెరుములా ఉద్భవించిన మరుక్షణంలో ఆ అమ్మాయి అన్నది; “ముక్కు మొగము ఎరగని ఒక యువకుని ఉద్ఘాటించి మా యింటికి రావయ్యా అని పిలిచిన ఓ అమ్మాయి నీ మనస్సులోని ఆశయమూర్తి అయిన దేవతాకన్య అనుకున్నావా?”

ఈ బాలికకు ఎదుటివారి మనస్సు అవలీలగా గ్రహించే శక్తి ఉన్నదా ఏమిటి చెప్మా!

ఆ అమ్మాయి చిరునవ్వు నవ్వుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది. చదువుతూ ఉన్నప్పుడూ స్వప్నాలకన్నాను. పలికిన పలుకులలో పాడిన పాటలలో తలపులకు దాటిన వర్ణాల కలుపులకు మీరిన స్వర్ణాల స్వప్నాలకు ఆవలి అయిన రూపురేఖల రుచి తాళతళ్యానికి ఒదుగుతూ నులువెచ్చని దైహిక పరీమళాలకు అందీ అందకున్నట్లు ఏదో ఒక మూర్తికై ఆశించి ఆశించి అది గీటురాయిగాక అలంకార నిబంధనగాక వీటికి మించిన ఏదో అనన్య సౌందర్య శాస్త్రానుభూతమైన ఒక పరమ భావానికై చేతులుచాచిన నేను--నా సోమసుత ఈ బాలికా మూర్తిలో తేజస్వినియై నాకు దివ్య దర్శనమిస్తుందని నేనెలా అనుకొని వచ్చాను?

ఒక్క పరమ భావము నాకు
చిక్కునో లేదో
ఒక్క అతిలోక సౌందర్య
మది దొరుకునో లేదొ
ఎందుకీ అన్వేష
ణెందు కీ యాత్రలు
మృగతృష్ణలో నీరు
ఇంద్రధనువుల తీరు
ఏనాటికైన నిజమా?

ఈ పాట నేను సన్నని గొంతుకతో పాడుకుంటూండగా ఆ అమ్మాయి రెండు మూడు మిఠాయిలతో వొలిచిన సాత్కుడి తొనలతో కాఫీ సెట్టుతో అవి అన్నీ పనికత్తెచేత పట్టించుకుని లోపలికి చక్కావచ్చింది.

"నిరుడు మీరూ నేనూ ఒకే కాలేజీలో చదివితిమి. నిరుడు మీ చదువు పూర్తిచేసుకుని వెళ్ళిపోయారు. నా చదువు ఇంకా మూడేళ్ళు పట్టుతుంది. కాలేజీలో మీ ఉపన్యాసాలు విన్నాను. కృష్ణశాస్త్రిగారి ఊర్వశి, బాపిరాజుగారి "శశికళ" మీరు అత్యుత్కృష్ట భావాలని ఇచ్చిన ఉపన్యాసాలు విన్నాను."

"ఆ మీటింగులో మీరుకూడా ఉన్నారా ఏమిటి?"

"ఆ, వున్నాను, మీరు ఆరోజున "ఊర్వశి" పాటలు "శశికళ" పాటలు రెండూ చదువుతూ అభినయంచేశారు. జ్ఞాపకం వుందో లేదో, మీరు చదివే విధానం, మీరు చదివిన పాటలలో ముఖ్యంగా మీరు కనపర్చిన వాచికాభినయం నన్ను ఆనాడే సమ్మోహపర్చాయి."

"అప్పటినుంచి మీరు నే నానాడిచ్చిన ఉపన్యాస విషయాన్ని చర్చించుకుంటూనే వున్నారా?"

4

"వినడమే కాదు. నేను ఈయనకు శశికళనైతే ఏమనుకుంటాడని అనుకున్నాను" అని ఆ అమ్మాయి పక పక నవ్వింది.

నేను తెల్లబోయాను. నాకు మాటలేదు. ప్రపంచాతీతమైన సోమసుతాభావము ప్రపంచంలో వున్న ఒక బాలికలో ఏలా ప్రతిఫలించగలదు!

"మీరు వెదకే స్వప్నము ఎప్పుడూ స్వప్నమే. స్వప్నాలు ఎప్పుడూ నిద్దురపోయేవారికే. ఈనాడు దేశంలో కాటకం: దేశం అవతల భయంకర యుద్ధం. దేశం అంతా రోగాలు; దేశం అవతల దారుణ యుద్ధాగ్ని జ్వాలలు. ప్రపంచమంతా ఆర్తనాదం. ఆర్తనాదంలోను మహాప్రళయంలోనూ అందం ఎక్కడ, ఆనందం ఎక్కడ? ఊహింపగరాని ఏదో ఒక మూర్తిని నిర్మించుకొని అది ఎక్కడ అని సర్వప్రపంచము ఎన్ని యుగాలు వెతకగలరు? కక్షలూ కాటకాలులేని రోజుల్లోకూడా కలలు కనడానికి తావులేదే!"

"మానవాతీతమైన సౌందర్యం వెతకడంలో మానవోత్తమమైన సౌందర్యం దర్శనమౌతుందా లేదా?"

"ఎంత వుత్తమమైనా! మానవ సౌందర్యమేకదా!"

ఉపహారానంతరం నేను మెల్లిగా ఇంటికి చేరుకున్నాను. ఈ సౌందర్యాన్వేషణ యొక్క పరమార్థమేమిటి?

5

సౌందర్యోపాసన, మనుష్యుని జీవితాభ్యుదయాని క్కావలసిన కఠినత్వాన్ని కరగించివేసి, బానిసత్వ చిహ్నమైన వెన్నతనాన్నీ, నీళ్ళు కారిపోవుతనాన్నీ మనుష్యుని బ్రతుకంతా నింపుతుందట. ఏ దేశంలోనైనా ఉత్తమ కళలు ఉద్భవించిన కాలం వీరులైన మహారాజులు సామ్రాజ్యాలు స్థాపించిన రోజుల్లోనూ సామ్రాజ్యనిర్మాతలైన ఆంధ్రుల కాలంలో – ధాన్యకటకం మొదలైన శాతవాహన శిల్పం, రాయలకాలంలో విజయనగర శిల్పమూ ప్రభంధయుగమూ తారాపథాలంటాయి; పాశ్చాత్య దేశాల్లోను ఏథెన్సు అత్యంత బలవంతమై యున్నప్పుడు, పైడాసు మహాశిల్పి ఒక దివ్య శిల్ప ప్రపంచం అల్లివేశాడు. ఇక సౌందర్యారాధన బలహీనమెల్లా అవుతుంది? ఆ అమ్మాయి యొక్క భావం ఏమయి ఉంటుంది? శృంగార స్వరూపమైన సౌందర్యార్చన సామ్రాజ్యతత్వాన్ని తెలియజేస్తుంది. మానవ జీవిత – సౌందర్యార్చన, మహోత్కృష్టమైన ప్రజాసామ్యశక్తిని మూర్తీభవింపజేస్తుంది. అని కాబోలు! పుష్పేతరమైన పరీమళము ఏది? జీవితేతరమైన సౌందర్యమేది? ఈ సౌందర్యానుభూతులన్నీ సప్తస్వరాలుచేసి, ఆశయం తాళంచేసి, ఒక మహా గాంధర్వం అల్లుతాడా మనుష్యుడు. ఆ రాత్రంతా నాకు నిదుర దరికి చేరలేదు. కలహాంతరితయైన నాయికవలె తన ఆనందాన్ని, నా ఆనందాన్ని కూడా చెడగొట్టుకొన్నది.

ఎందుకు ఆ బాలిక నన్ను పిలిచింది? ఏదో నాదారిని నేను

"తోవతెలియని నేను
ఏవైపు పోదునో!
నా వెదుకు తపసులో
నా సిద్ధియే నాకు"

అని పాడుకొన్నాడు.

ఆ బాలిక నా ఆలోచనా – పథాలనుండి మాయముకాదు. ఆమె సౌందర్యస్ఫుటరేఖా ప్రవాహాలు నాహృదయ సముద్రంలోనే సంగమించాలా! ఆమె నున్నటి గులాబి పెదవుల హాస్యహాసాంచలాలు, నాకు సోమసుతవెన్నెలలే యగునా? కర్కశమై అతి – మానుషమౌ స్త్రీ పురుష ప్రేమ తన్ను తాను మరపించుకొనే మోసబుద్ధితో, సోమసుతా – భావమున ప్రత్యక్షం చేసుకొంటున్నానా?

రాత్రి పన్నెండైంది. నా చిన్న మేడవీధి తలుపు ఎవరో తట్టినారు. దీపాలన్నీ వెలిగించుకుంటూ కిందకు వెళ్ళి తలుపు తీసినాను. ఎదుట ఆ అమ్మాయి, ఆమె అన్నగారు "నేను లోపలికి రావచ్చునా?"

ఈమె, నా మధుర మధురాలోచనలకు చిరుచేదులు కలుప వచ్చినది కాబోలు.

ఆమె: ఓయి వెఱ్ఱివాడా! నీ ప్రేమకోరి నేను రాలేదు. నా ప్రేమను నీకర్పింపరాలేదు. ప్రేమ అనేది మనుష్యుల్లోని నీరసత్వాన్ని కప్పిపుచ్చే అందంగా చెక్కిన మూతవంటిది. సినీమా చూచి వెడుతూ నీ డాబామీద నీవు తిరగడం చూచి, నిద్రపట్టనీయని సోమసుతారాధనావేదన నాకు నవ్వు కలిగిస్తే ఉపయోగము కాని నీ శక్తులు నాలో కరుణ స్పందింపజేసి, నన్ను నీ గుమ్మం దగ్గిర ఆపి నిన్ను పిలిపింపజేసినవి. నీ తలుపు వేసుకో, నేనీ గుమ్మం ఇవతలనే వెనక్కుతిరిగి నా దారిని నేను, నా గుండెపై సమ్మెట పెట్టు...

నేను "......నా ఒకనితనంలో మరియాదలు మఱచిపోయిన మొఱకుణ్ణి నేను. మీ యిరువురూ లోనికి దయచేయండి, అదే నన్ను క్షమించిన గుర్తు".

మేము ముగ్గురమూ ఆ డాబాపైకి వెళ్ళి కూర్చున్నాము. నాకు మాటలేదు. ఆలోచనలేదు. ప్రశ్నలేదు. జవాబు లేదు. కుంగి హృదయంపై తలవాల్చి, అమర్యాదవస్త్రము కప్పుకొని, వారిరువురి ఎదుటా, నా కుర్చీలోనే "సోమసుతా! సౌందర్యమే నీవై, సర్వరసాధిదేవివి నీవై, ఆనంద సిద్ధివై అర్చనవై, ఫలమవై, కోమలత్వానివై అలంకారమవై సమ్యగ్రేఖా విన్యాసమవై నీ వెచ్చట.

"చల్లన్ని వెలుగులో
పుల్లమగు పూవులో
తళుకాడు తారలో
తరుణబాలల హృదిని
నీవు నిలిచెదవేమె?
నిజమేమి తెలియగల?"

వారివారి ఆసనాలపై వారిద్దరూ ఉన్నారా, లేరా! అని తలెత్తి చూచాను. అతడు లేడు. ఆమె నాదగ్గరిగా నిల్చుని వుంది.

"ఓయి కలలమూర్తీ! కలలు కడుపులోనికి కాసింత కూడు పెట్టగలవా? నీ విచిత్ర చరిత్రను నా అన్న నాకు వెనకే చెప్పినాడు. నువ్వు చిత్రకారుడవు. కవివి. రాజకీయ సమాలోచనా ప్రశస్త సిద్ధాంతవేత్తవు. కడుపులుమాడి, కళ్ళు దించుకుపోయి, కట్టుబట్టలేక, కాటక-రాక్షస హస్తాలల్లో ప్రాణాలు చిమ్మ నలిపివేయబడిన మానవజాతి, నీ సౌందర్యార్చనలో భాగం కాలేదా?

"సౌందర్యారాధనకూ దైన్యానికీ శృతి కలవదు."

"నీ వెరిగున్న బాలికలలో నే నందమైనదాననా కాదా? నన్ను చూసి చెప్పు. రంగులుపూసి, రేకలు దిద్ది, సృష్టిలోని అపశృతిని సవరించాననుకొనే కల్పనాసుందరి

కన్న నే సౌందర్యవతినా కానా, నన్ను చూసి చెప్పు నీవు విన్యసించిన కళ్ళలో ఈ కాంతులున్నావా? నీవు పులిమున ఆ దేహపు రంగులో ఈ మసృణత్వమున్నదా? పరిమళ పూరితమై నునువెచ్చనై మహా మధురకాంక్షలను ప్రస్రవణిస్తూ ఉన్న నా యీ అద్భుత మూర్తికి నువ్వా వంకరదిద్దువాడవు? ఎంత వెఱ్ఱి చిత్రకారుడవు! పోనీ నీ పాటలతో నన్ను వర్ణించు; ఎన్ని పాటలు వ్రాయగలవు? నీ రంగులపెట్టెలోని అరుణ వర్ణాన్ని తిరిగి తిరిగి కలిపినా, దివ్య మనోహరార్ద్రిత రేఖాసమన్విత మంజిష్ఠ వర్ణము తీసుకొని రాగలవా? ఓయి వెఱ్ఱివాడా! జీవిత మాధుర్యం గుర్తెరిగినవాడే అమృతం వూహించుకోగలడు. గాఢ నిర్భర మానవదైన్యం హృదయమార త్రేపులు త్రేణ్చినవాడే దివ్యకాంతి ప్రసరిత కరుణ – రసాత్మక బ్రహ్మానందము చవిచూడగలుగుతాడు. నేను నీకై వచ్చాను. నీకైయే నన్ను నీ గుమ్మందాటి వెళ్ళిపొమ్మంటావా?"

ఆమె చుట్టూ వెన్నెలలు, ఆమె నుంచి వెన్నెలలు, ఆమె చలితాక్షుల వెన్నెలలు, ఆమె రసాల కిసలయ – మసృణాధరోష్ఠాల వెన్నెలలు. దేవీ! నువ్వేనా, సోమసుతవు? బహుకాల స్వాతంత్ర్యయోగతప్త శుష్కన పువ్వులో నువ్వు, సర్వమానవకోటి కళ్యాణ గమ్యపథదుర్గమ యాత్రికులైన నాయక శ్రమిత ఘర్మాంబువులలో నువ్వు, సర్వ వికృతులలో నువ్వు, రసాకృతీ! రస – మయాకృతీ!

ఆమె పాదములు స్పృశించి, లేచి, ఆమె రెండుచేతులను గ్రహించి, నా చుట్టూ నిర్మించుకొన్న నా యింటి ముఖద్వారము నా సోమసుతతో దాటి సముద్రతీరానకు జేరినాను.

అక్కడ అధివసించి మేము, మా యెదుట నృత్యము చేయు తరంగలాసికా రమణీ బృందము.

ఆమెను హృదయాను కద్దుకొని, ఆమె పెదవులను ముద్దిడినాను. కంటి కొలకుల నుండి స్రవించి, పెదవుల తడుపు ఆమె భాష్పములు లవణ మయములు. ఆమె పెదవులు మహా మధురములు. లావణ్యములైన తరంగాలను చుంబిస్తూ మహా మధురములైన వెన్నెలలు.